సోయా రైతుల కన్నీరు

- అధిక వర్షాలు, తెగుళ్లతో తగ్గిన పంట దిగుబడులు
- పెట్టుబడులూ వచ్చేలా లేవని కర్షకుల ఆవేదన
- మద్దతు ధర కల్పించి.. ప్రభుత్వమే కొనాలని వేడుకోలు



వెంకూర్‌లో తెగుళ్లు సోకి దెబ్బతిన్న సోయా పంట

నాలుగెకరాలకు క్వింటాల్‌న్నరే



ఈ చిత్రంలో ఉన్న ది కుంటాలకు చెందిన రైతు జక్కుల సంతోష్. తనకున్న నాలుగెకరాల్లో సోయాపంట సాగు చేశాడు. కనీసం 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. కానీ పంటకు తెగుళ్ల సోకడంతో కేవలం క్వింటాల్‌న్నర(150 కిలోలు) మాత్రమే దిగుబడి వచ్చినట్లు బాధితుడు వాపోయాడు.

కన్నీళ్లే మిగిలాయి..



ఏటా వానాకాలంలో సోయా, రబీలో మొక్కజొన్న పంట సాగు చేస్తా. ఈసారి రెండున్నర ఎకరాల్లో సోయా పంట సాగు చేసిన పంటకు తెగుళ్ల సోకింది. దీంతో పంట నూర్పిడి కూడా చేయించలేదు. చేనులోకి వెళితే కన్నీళ్లే వస్తున్నాయి.
– చిన్న భూమన్న, కుంటాల

అధికంగా ఎరువులు వినియోగించడంతోనే..

రబీ సీజన్‌లో రైతులు అధిక దిగుబడులు రావాలని మొక్కజొన్న పంట కోసం విపరీతంగా ఎరువులు వాడారు. భూమిలో కరగకపోవడంతో వానాకాలంలో సాగు చేసిన సోయా పంటపై ప్రభావం చూపింది. మోతాదుకు మించి వాడడం వల్లే తెగుళ్లు సోకాయి. అధికారుల సూచన మేరకే ఎరువులను వాడాలి. – సోమలింగారెడ్డి, ఏవో

కుంటాల: ఈసారి వానాకాలంలో జిల్లాలో సోయా పంట సాగు చేసిన రైతులకు పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొంది. ప్రారంభంలో అధిక వర్షాలు.. తర్వాత తెగుళ్ల కారణంగా పంట పసుపు రంగులోకి మారింది. దీంతో దిగుబడులు చాలా వరకు తగ్గిపోయాయి. పెట్టుబడులకు అప్పులు చేసి ఆరుగాలం శ్రమించి పంటను పండిస్తే తమను కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు.

మండలాల వారీగా..

పత్తితో పోలిస్తే తక్కువ పెట్టుబడులు అవసరమవుతాయని జిల్లాలోని రైతులు కోటిఆశలతో వా నాకాలంలో సోయా పంట సాగుకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో లోకేశ్వరం మండలంలో నాలుగు వేల ఎకరాలు, కుంటాలలో 5,400 ఎకరాలు, ముధోల్‌లో 5,650 ఎకరాలు, కుభీర్‌లో 5,820, తానూరులో20,120, ముధోల్‌లో, 16,500 ఎకరాల్లో సోయా పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

ధర,దిగుబడులు తగ్గాయి..

ఓవైపు దిగుబడులు తగ్గడం.. మరోవైపు పండించిన పంటకు ధర లేకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో సోయా పంట క్వింటాల్‌కు రూ.ఐదు వేల వరకు ఉండగా.. ఈసారి రూ.4,500 కు మించి ప్రైవేటు వ్యాపారులు కొనడం లేదు. ఇప్పటికే పంట కోతలు అధిక శాతం పూర్తవగా.. ఆరబెడుతున్నారు. సాధారణంగా ఎకరాకు సుమారు 8 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. కుంటాల మండలంలో మాత్రం ఈసారి ఎకరాకు క్వింటాల్ నుంచి రెండు క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చిందని.. రైతులు పేర్కొంటున్నారు. కొందరు దిగుబడి రాదని పంటను నూర్పిడి చేయలేక వదిలేశారు.

ప్రభుత్వమే కొనాలి..

అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా సోయా పంటను నష్టపోయామని.. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొని నష్టపోయిన వారిని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధిక ఎరువులతో నష్టాలు..

జిల్లా వ్యాప్తంగా రబీ(యాసంగి) సీజన్‌లో రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. అధిక దిగుబడులు రావాలనే ఉద్దేశంతో పంటలకు విపరీతంగా యూరియా వెదజల్లారు. దీంతో నత్రజని ఎరువులు భూమిలోనే ఉండిపోయింది. తద్వారా వానాకాలంలో కాండం తొలిచే పురుగుకు వాతావరణం అనుకూలించింది. దీంతో సోయా పంట పసుపు రంగులోకి మారి దిగుబడులపై ప్రభావం చూపిందని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

40 ఏళ్లుగా కాంగ్రెస్‌కే సేవలు



ఆనంద్‌రావుపటేల్, కాంగ్రెస్ నేత

భైంసా: సొంత లాభం కోసం కొందరు నాయకులు తరచుగా పార్టీలు మారుతున్న ఈ రోజుల్లో.. విలువలకు కట్టుబడి ఏళ్లుగా ఒకే పార్టీలో కొనసాగుతున్నవారు చాలా అరుదుగా కన్పిస్తారు. నమ్మిన సిద్ధాంతం, పార్టీ కోసం 40 ఏళ్లుగా సేవ చేస్తున్న నాయకుడు భైంసా మండలం మాంజ్రి గ్రామానికి చెందిన సింధే ఆనంద్‌రావు పటేల్. అందరితో కాకాగా పిలిపించుకునే నాటి ఎమ్మెల్యే గడ్డిగారి గడ్డెన్న సహచర్యంలో రాజకీయ ఓనమాలు దిద్దారు. 1983లో కాంగ్రెస్‌లో చేరి ఇప్పటికీ అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఒకసారి సర్పంచ్‌గా పనిచేశారు. 2008–09లో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, 2013–14లో భైంసా ఆత్మ చైర్మన్‌గా, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 1999లో అప్పటి సీఎల్పీ నేత వైఎస్సార్ హయాంలో ఒకసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్‌లో పని చేస్తున్న సింధే ఆనంద్‌రావు పటేల్ వైఎస్సార్ పాదయాత్ర, బస్సుయాత్రలోనూ పాల్గొన్నారు. ఇలా విధేయతతో పనిచేస్తున్న వారికి సీటు ఇవ్వాలని పలువురు చర్చించుకుంటున్నారు.

జంగ్ తెలంగాణ

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..



భైంసాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కుంటాల: అందాకూర్‌లో నిమజ్జనానికి వెళ్తూ..



కుభీర్‌లో కోలాటం ఆడుతున్న మహిళలు



లోకేశ్వరం: జోహర్‌పూర్‌లో మహిళలు

భైంసాటౌన్: 'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ' అంటూ పాడుతూ మహిళలు బతుకమ్మ ఆడారు. గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అనంతరం గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు బతుకమ్మలతో శోభాయాత్రగా వెళ్లి నీటిలో నిమజ్జనం చేశారు.

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ఊరేగించి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అనంతరం వాగులో నిమజ్జనం చేశారు.

కుంటాల: మండలంలోని అందాకూర్, విఠాపూర్ గ్రామాల్లో బతుకమ్మ పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు కిషన్, లక్ష్మీరమేశ్, ఎంపీటీసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి అవకాశం ఇవ్వండి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



పంటకుప్పల వద్ద ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రచారం

భైంసా: నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ముధోల్ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం ముధోల్ మండలం రువ్వి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ఆసరా పింఛన్లను రూ.ఐదు వేలకు పెంచుతారని పేర్కొన్నారు. అంతకుముందు సోయా పంట కుప్పల వద్ద రైతులతో మాట్లాడి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. వారి వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోగ్గుట నర్సయ్య, రమేశ్‌గౌడ్, సాయన్న, లచ్చారెడ్డి బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి, రాజూర సర్పంచ్ ముత్తగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సాయారెడ్డి తదితరులు ఉన్నారు.

'పల్సి మండల ఏర్పాటుకు మద్దతివ్వండి'

భైంసాటౌన్: కుభీర్ మండలంలోని పల్సి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌కు మద్దతు తెలపాలని పల్సి మండల సాధన సమితి నాయకులు భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబుకు విన్నవించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో వారిని కలిసి విన్నవించారు. పల్సి, పల్సితండా–1,2, రంజని, రంజనితండా, సిర్పెల్లి, పార్డి(కె), తండా, కస్రా, తండా, గోడాపూర్, నిగ్వా, పాంగర్‌పాడ్, హంపోలి, సోనారి గ్రామాలు నూతన మండలం ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు పంచాయతీ తీర్మానాలు అందించాయని పేర్కొన్నారు. స్పందించిన చైర్మన్ తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. హన్మాండ్లు, బాలరాజు తదితరులున్నారు.

సంక్షేమం కోసం మళ్లీ గెలిపించాలి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్



కార్యకర్తలతో మట్లాడుతున్న జాన్సన్‌నాయక్

దస్తురాబాద్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిలిచిపోకుండా వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించి ఆ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, జెడ్పీటీసీ సంతపురం శారద, సర్పంచ్‌లు శంకర్, సురేశ్ నాయక్, భూమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్యయాదవ్, రాజనర్సయ్య, జయలక్ష్మి, సంతోష్, రాజు, శ్రీశైలం,సుధాకర్, రమేశ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

జాన్సన్‌నాయక్‌ను గెలిపిస్తామని ప్రతిజ్ఞ

పెంబి: ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్ నాయక్‌ను గెలిపిస్తామని మండలంలోని అంకెన గ్రామస్తులు సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండలంలోని కర్ణంలోద్ది, రాయదారి, కోరకంటి, పోచంపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, గోవింద్, నాయకులు ఉన్నారు.

'ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు వద్దు'

నిర్మల్‌రూరల్: సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మెస్ కేర్ టేకర్‌గా, హాస్టల్ డిప్యూటీ వార్డెన్ గా అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్ సీపీఎస్ ఈయూ) జిల్లా అధ్యక్షుడు కొండన్నగారి కృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల సిబ్బందికి బోధనేతర పనులను అప్పగించడం మానుకోవాలని కోరారు. అదనపు బాధ్యతలతోనే ఇటీవల చెన్నూర్ గురుకులం అధ్యాపకురాలు తిరుమలేశ్వరి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. గురుకులాల్లో సంక్షేమ అధికారులను నియమించి ఉపాధ్యాయులను అదనపు బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



పాదయాత్రగా వెళ్తున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ, బోనాల పండుగను పరిరక్షించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా గ్రామానికి వచ్చిన ఆయనకు మహిళలు మంగళహారతులు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. వారి వెంట నాయకులు రావుల రాంనాథ్, సామల పద్మ, వీరయ్య, విలాస్, చంద్రప్రకాశ్‌గౌడ్, రాజేశ్వర్, నవీన్, సాహెబ్‌రావు, ముత్యం రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

మామడ: బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన రెడ్డి, గంగపుత్ర, నాయక్‌పోడ్, ముదిరాజ్, మున్నూర్‌కాపు యువజన సంఘాల యువకులు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజారెడ్డి, బాపురెడ్డి, నరేశ్, ముత్యం, గంగారెడ్డి, రాజేశ్వర్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు



నిర్మల్‌లో పూజలు చేస్తున్న భక్తులు



కల్లూర్ ఆలయంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గురువారం అన్నదాతలుగా నిలిచిన హేమలత–శివకుమార్, సునీత–పోశెట్టి, అనూష–ప్రసాద్, అలేఖ్య–రాజేందర్ దంపతులను ఆలయ చైర్మన్ పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు జైపాల్‌రెడ్డి, ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, ఆమెడ శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం సందడి నెలకొంది. హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

దుర్గమ్మా.. కరుణించమ్మా



ఖానాపూర్: చింతల్‌పేట్‌లో బోనాలతో భక్తులు



సోన్: సిద్దులకుంటలో మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్న అల్లోల దివ్యారెడ్డి



లోకేశ్వరం: పంచగుడిలో మండపం వద్ద భక్తులు



కుంటాలలో ఆలయం వద్ద భక్తులు

ఖానాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బాదన్‌కుర్తి పంచాయతీలోని చింతల్‌పేట్, గోసంపల్లె పంచాయతీలోని నడింపల్లె, సత్తన్‌పల్లిలో భక్తులు బోనాలు సమర్పించారు.

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లిలో గురువారం దుర్గాదేవి మండపం వద్ద డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి పూజలు చేశారు. ఆయన సొంతంగా రూ.లక్షతో అమ్మవారి మండపం కోసం షెడ్డు వేయించారు. రాజు, శంకర్, సుధాకర్, చిన్నారెడ్డి, నరేశ్, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు

లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌లో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ రాజవ్వ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెడ్మ బొజ్జు పూజలు


కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో గురువారం దుర్గాదేవి మండపం వద్ద టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పూజలు చేశారు. అంతకుముందు గ్రామంలో గ్రామానికి చెందిన వీరవ్వ మరణించగా.. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, సత్తెన్న, వాజిద్‌ఖాన్, బబ్లూ, రాజు, రహీం, రఫీక్ తదితరులు ఉన్నారు.

కుంటాల: కుంటాలలో ఛత్రసేన, శివసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల నుంచి భక్తులు బోనాలతో గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

సోన్: మండలంలోని సిద్దులకుంటలో మహిళలతో కలిసి మంత్రి ఐకేరెడ్డి కోడలు అల్లోల దివ్యారెడ్డి బోనం ఎత్తారు. అనంతరం పోచమ్మతల్లికి, దుర్గామాతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ భూమన్న, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో దుర్గాదేవి మండపం వద్ద మహిళలు మంగళహారతులతో వచ్చి పూజలు నిర్వహించారు. అమ్మవారి దీక్షాపరులు మొక్కులు తీర్చుకున్నారు.

రాంపూర్‌లో కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో గురువారం వేకువజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించా రు. నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంతో పోలీసులు ఇంటింటా తనిఖీలు చేపట్టారు. పత్రాలు సరిగా లేని 63 ద్విచక్రవాహనాలు, ఆటో, రెండు ఫోర్‌వీలర్లను స్వాధీనం చేసుకున్నారు. పెండింగ్ చలాన్లు కట్టించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని.. అనుమానితులుంటే సమాచారం ఇవ్వాలని సీఐ పేర్కొ న్నారు. వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. సర్పంచ్ గోవింద్‌రెడ్డి, నర్సాపూర్(జీ), దిలావర్‌పూర్, సారంగపూర్, నిర్మల్‌రూరల్ ఎస్సైలు రవీందర్, అలీ, కృష్ణసాగర్‌రెడ్డి, చంద్రమోహన్ తదితరులున్నారు.

క్లుప్తంగా

నేడు సుమంగళి పూజ

నిర్మల్‌టౌన్: పట్టణంలోని అతి పురాతన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 20న సుమంగళి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూల నక్షత్ర శుభముహూర్తాన ఉదయం 10 గంటలకు లక్ష్మి అమ్మవారికి విశేష కుంకుమార్చన, అష్టోత్తర, లలిత సహస్ర నామాలు, 11వేల గాజుల పూజ ఉంటుందని తెలిపారు. పూజ అనంతరం మహిళలకు అమ్మవారి ప్రసాదంగా గాజులు అందిస్తామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి అండ



నగదు అందిస్తున్న ఉద్యోగులు

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ సాయికృష్ణ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగులు జమ చేసిన రూ.46 వేలను గురువారం బాధిత కుటుంబసభ్యులకు అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కుంటాల: అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీ, బ్యాంకు వివరాలు చెప్పొద్దని ఎస్సై హన్మాండ్లు సూచించారు. గురువారం మండలంలోని విఠాపూర్‌లో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గల్లపురం లక్ష్మిరమేశ్, పోలీస్ సిబ్బంది అనుప్రియ, శ్యామ్‌నాయక్, బిక్కు పాల్గొన్నారు.

పార్‌పెల్లిలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామ వడ్డెర కాలనీలో ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జ్వరంతో బాధపడుతుండటంతో వారి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య సహాయకులు శివకృష్ణ, సిబ్బంది సుజాత, రమ, కళ తదితరులు పాల్గొన్నారు.


గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు

మామడ: మండలంలోని జగదాంబతండాలో గురువారం సోన్ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీకి వినియోగించే 100లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. అనంతరం గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వారి వెంట ఎస్సైలు రాజు, శ్రీకాంత్, రవీందర్, ఆర్ఎస్సై రవి ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రవీందర్

లోకేశ్వరం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా రవీందర్ బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ మోతీరాం తెలిపారు. ఈ సందర్భంగా నూతన డీటీని ఘనంగా సన్మానించారు. ఇక్కడ డీటీగా పని చేసిన అశోక్ బదిలీపై కలెక్టరేట్ వెళ్లగా.. నిజామాబాద్ జిల్లా డోంకేశ్వర్‌లో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేసిన రవీందర్ ఇక్కడకు వచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకిషన్, సిబ్బంది నరేశ్, సాగర్ తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చులతో పొలాలకు రోడ్డు



పొక్లెయిన్ వద్ద దేవన్న

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామంలో మంచినీళ్ల చెరువు ప్రాంతంలోని పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గురువారం గ్రామానికే చెందిన గిర్మాయి చిన్నదేవన్న రూ.20వేలు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలు, చెట్లను తొలగింపజేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిన్నదేవన్నను అభినందించారు.

ముమ్మర తనిఖీలు

కుంటాల: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై హన్మాండ్లు హెచ్చరించారు. గురువారం మండలంలోని అర్లి(కె) క్రాస్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. మద్యం, డబ్బు అక్రమంగా తరలించే వారిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమావళికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.